విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 01 జూన్ 2025 | 8 పేజీలు | epaper.visalaandhra.com

ఘనంగా సీపీఐ నియోజకవర్గ
మహాసభ

- వెలుగొండ ప్రాజెక్టుకు రూ.4వేల కోట్లు నిధులు కేటాయించాలి
- పేదలకు పట్టణంలో 2, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలం
- ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి
- భూమి లేని ప్రతి పేద కుటుంబానికి 3 ఎకరాలు పంచాలి :సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - కనిగిరి: సీపీఐ పార్టీ నియోజకవర్గం 4వ మహాసభను శనివారం స్థానిక ఒంగోలు బస్టాండ్‌లోని షాదిఖానాలో నిర్వహించారు. పులి వెంకటరెడ్డి పార్క్ వద్ద నుంచి వైయస్సార్ రోడ్, ఎమ్మెస్సార్ రోడ్ బొడ్డిచావిడి మీదుగా ఒంగోలు బస్టాండ్‌లోని షాదీ ఖానా వరకు సీపీఐ పార్టీ జెండాలు చేతపట్టి నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం షాది ఖానా వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు ఎర్ర జెండాను ఆవిష్కరించారు. వజ్రాల సుబ్బారావు, గులాం హుస్సేన్, జయంపు పవిత్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభకు సిపిఐ జిల్లా కార్యదర్శి యంఎల్ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ పేదల పక్షాన నిలిచి కార్మిక, కర్షక, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని అప్పుల పాలు చేశాయన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు నేటి పాలకులు దేశాన్ని తాకట్టు పెట్టారన్నారు. రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ పేరుతో కనిగిరి ప్రాంతంలో 4 ఎకరాల భూమిని అంబానీ సంస్థలకు ప్రభుత్వం కట్టపెట్టిందన్నారు. పేదలకు పట్టణంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు పేదలకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములను - మిగతా 2 లో

ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ప్రజల సంక్షేమం, జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. శనివారం ఆమె అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం స్థానిక దక్షిణ బైపాస్ రోడ్ సెంటర్‌లోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, డీఆర్‌డీఏ విద్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా అందుతున్న సేవలపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో చట్టసభ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టరు ఆర్ గోపాలకృష్ణ, జడ్పీ సీఈఓ చిరంజీవి, బాపట్ల, నెల్లూరు జిల్లాల డీఆర్ఓలు గంగాధర్ గౌడ్, ఉదయ బాస్కర్ పాల్గొన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసన సభ్యులు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్ విజయ కుమార్, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ హాజరై ఆయా శాఖలకు సంబందించిన పలు అంశాలను ప్రస్తావించారు. ఆర్‌డబ్ల్యుఎస్ - మిగతా 2 లో

జూన్ 4న వెన్నుపోటు
దినోత్సవం :వైసీపీ

విశాలాంధ్ర -ఒంగోలు :చంద్రబాబు నాయుడు వెన్నుపోటు రాజకీయాలకు నిరసనగా ఈనెల 4న జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెర్సీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను వైసీపీ నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాడు మామ ఎన్టీఆర్ ను, నేడు రాష్ట్రంలోని మహిళలను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో - మిగతా 2 లో

కోరంతో పనిలేదా?

- మొక్కుబడి సమావేశాలతో ఒరిగేదేమిటని నిలదీత
- ప్రజాప్రతినిధులకు గ్రామాభివృద్ధి పట్టదా?
- ఈ ఘటనపై మంత్రి స్పందించాలి
- బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - సంతమాగులూరు : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి సొంత నియోజకవర్గం అద్దంకి పరిధిలోని సంతమాగులూరు మండలం సర్వసభ్య సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటని బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ ప్రశ్నించారు. మంత్రి ఇలాకాలో కోరంతో పనిలేదా అని ఆయన నిలదీశారు. శనివారం సీపీఐ సంతమాగులూరు మండల సమితి సహాయ కార్యదర్శి కాలేషాగారి ఖాదర్ బాషా, రైతు సంఘం ఏల్చూరు గ్రామ శాఖ కార్యదర్శి చీదర్ల కొండయ్యతో కలిసి సింగరకొండ మీడియా సమావేశంలో మాట్లాడారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు,గ్రాంట్లు గురించి చర్చ జరగకపోవ డాన్నీ ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజల పక్షాన బాధ్యత గల పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులకు ఇవేమీ పట్టకపోవడం శోచనీయమన్నారు.అసలు సమావేశం నిర్వహణకు సంబంధించిన ముందస్తు సమాచారం ఎంపీటీసీలు, సర్పంచులకు మండల పరిషత్ అధికారులు తెలియజేశారా,లేదానే అనుమానం కలుగుతోందన్నారు.ఈ విషయంలో ఎంపీడీవో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.మండలం పరిధిలోని గ్రామ పంచాయతీల్లో సామాజిక వర్గాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు, పనుల కేటాయింపుపై ఊసే ఎత్తలేదన్నారు.తమకు తోచిన రీతిలో సమీక్షలతో సరిపెట్టారని ధ్వజమెత్తారు.ఒకవేళ తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు చక్కబెట్టడం కోసమే సమావేశం జరిగిందేమోనని విమర్శించారు.ఈ మండలంలో అధికారులే పార్టీ లీడర్లుగా అవతారమెత్తి చలామణి - మిగతా 2 లో

విపత్తు నిర్వహణపై ప్రణాళికలు : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : విపత్తు నిర్వహణపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలి,ఆ దిశగా పని చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిందన్నారు.పంట కాల్వలు,చప్టాలు,చెక్ డ్యాములు ఎలా ఉన్నాయో పరిశీలించాలన్నారు. కాల్వలు, చెరువు కట్టలు బలహీనంగా ఉన్న వాటిని గుర్తించి బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికంగా వర్షాలు కురిస్తే పట్టణ ప్రాంతాలలోని - మిగతా 2 లో

మహాసభ (మొదటిపేజీ తరువాయి)

భూమిలేని ప్రతి పేద కుటుంబానికి 3 ఎకరాలు చొప్పున భూమిని పంచాలని సీపీఐ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదలను మోసం చేసిందన్నారు. 2న పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించాలని ఆర్డీవో ఆఫీస్ వద్ద చేసే ధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పోలవరం, అమరావతి అంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. కానీ పనులు పూర్తి చేయడం లేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి చూపుతామని మాటలకే పరిమితం చేశారే తప్ప ప్రాజెక్ట్ పూర్తి చేయలేదని అన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి అయితే వెనుకబడిన ప్రాంతమైన ప్రకాశం జిల్లా వాసులకు త్రాగు, సాగునీరు పుష్కలంగా అందుతాయన్నారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగా వెలుగొండ ప్రాజెక్ట్ మొదలుపెట్టడం జరిగిందని నేటికీ వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని కమ్యూనిస్టు పార్టీ పోరాడుతూనే ఉందన్నారు. ప్రభుత్వాలు పాలకులు మాత్రం వెలిగొండ ప్రాజెక్టుని పూర్తిచేసే ప్రక్రియను కొనసాగించడం లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్‌కి రూ.4 వేల కోట్లు నిధులు వెంటనే కేటాయించి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలని మోసం చేస్తున్నాయని పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిని అణగదొక్కే ప్రయత్నాలు నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. పేదలకు అవసరమైన ఇళ్ల స్థలాలు ప్రభుత్వం వెంటనే అర్హులైన పేదలకు కేటాయించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై రవీంద్రబాబు మాట్లాడుతూ సిపిఐ పార్టీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో అలాగే కార్మిక శ్రామిక వర్గాల దారపున అనేక పోరాటాలు చేయడంలో సిపిఐ పార్టీ 100 సంవత్సరాలుగా పోరాడుతుందన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు తరుపున అనేక ఉద్యమాల్లో పాల్గొని వారికి న్యాయం చేకూరే విధంగా సిపిఐ పార్టీ కృషి చేసిందన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మిక, శ్రామిక, కర్షక వర్గాలకు అండగా సిపిఐ పార్టీ పోరాడుతుందన్నారు. ట్రిబుల్ ఐటీ, నిమ్జ్ వంటి వాటిని కనిగిరి ప్రాంతంలో స్థాపించడం వల్ల నిరుద్యోగులకు, విద్యార్థులకు అనేక అవకాశాలు చేకూరుతాయని అన్నారు. సిపిఐ పార్టీ తరుపున విద్యార్థి, యువజన సంఘాలు, రైతు, మహిళా, ట్రేడ్ యూనియన్ సంఘాలు పేదల పక్షాన పోరాడుతున్నాయన్నారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి జిపి రామారావు మాట్లాడుతూ 100 సంవత్సరాల సిపిఐ పార్టీ చరిత్రలో పేదల పక్షాన అనేక ఉద్యమాలు చేసిందన్నారు. జూన్ 2న స్థానిక ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అన్ని ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకులు బారీగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చెయ్యండి : సీపీఐ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : అర్హులైన పేదలందరికీ పట్టణములో రెండు సెంట్లు , గ్రామాలలో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి అన్నారు. శనివారం స్థానిక గుజ్జల యలమందరెడ్డి భవన్‌లో మండల కార్యాలయాల వద్ద జూన్ 2న జరుగు ధర్నా పోస్టర్‌ను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ సిపిఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి.ఆ ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి. జూన్ రెండవ మండల కార్యాలయాల వద్ద ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ప్రణాళికలు : కలెక్టర్ (మొదటిపేజీ తరువాయి)

మురికి కాల్వలోని మురుగు రహదారులపై పొర్లిపారే అవకాశం ఉన్నందున ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా ముందుగానే నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.తదుపరి ఆర్డీవోలు,సంబంధిత అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.తుపాను హెచ్చరిక నేపథ్యంలో గ్రామ స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీలను అధికారులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. బాపట్ల జిల్లాలో ఆరు మండలాలలో 31 గ్రామాలు తీర ప్రాంతంలో ఉన్నాయన్నారు.83 ఆవాస ప్రాంతాలలో ప్రజలు నివాసం ఉంటున్నారని చెప్పారు.ఆకస్మికంగా 20 ఎంఎం వర్షం కురిస్తే దిగువ ప్రాంతాలలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వృద్ధులు,గర్భిణీలు,దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు.మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ముందస్తుగానే నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణపై అధికారుల ప్రణాళికలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి.గ్లోరియా,చంద్రశేఖర్,ఉప కలెక్టర్ లవన్న, పర్యవేక్షకులు షేక్ షఫీ పాల్గొన్నారు.

కోరంతో పనిలేదా? (మొదటిపేజీ తరువాయి)

కావడం,ఒంటెద్దు పోకడకు నిదర్శన మన్నారు.ఇదిలాగే కొనసాగితే ప్రజల తరపున సీపీఐ పార్టీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా మంత్రి చొరవ చూపాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మళ్లీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి,ప్రజా సమస్యలపై,మండల అభివృద్ధిపై చర్చలు జరిపాలని ఆయన డిమాండ్ చేశారు.

దినోత్సవం:వైసీపీ (మొదటిపేజీ తరువాయి)

ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కావటం లేదని ధ్వజమెత్తారు. దీపం పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ లేదని, రైతాంగానికి గిట్టుబాటు ధరలు లేవని, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, సంపద సృష్టి ఎక్కడ అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించలేని కూటమి ప్రభుత్వం ప్రతిదానికి వైసీపీ పై పడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో చేసిన అప్పుల కన్నా, కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పాలనలో చేసిన అప్పులే ఎక్కువ అన్నారు. తెచ్చిన అప్పులు ఏమయ్యాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది అన్నారు. నాడు జగన్ పాలనలో తెచ్చిన అప్పుల నగదు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల జేబుల్లోకి వెళ్లాయి అన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. రెడ్ బుక్కును చూసి భయపడే వారు ఎవరూ లేరన్నారు. తప్పుడు కేసులను పోరాటాల ద్వారా తిప్పి కొడతామన్నారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ చుండూరి రవిబాబు, మార్కాపురం నియోజకవర్గం ఇంచార్జ్ అన్నా వెంకట రాంబాబు, కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ దద్దాల నారాయణ, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ మెరుగ నాగార్జున, కొండపి నియోజకవర్గం ఇంచార్జ్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర -తాళ్లూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని టిడిపి దర్శినియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. తాళ్లూరు వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో శనివారం రైతులకు సబ్సిడీపై మంజూరు అయిన వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ గొట్టిపాటి మాట్లాడుతూ ... రైతు మిషన్ ద్వారా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. వైసీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల పేరుతో రైతులను నిలువునా ముంచారని విమర్శించారు. మన ప్రభుత్వం రైతుల పక్షాన పనిచేస్తుందని, సీఎం చంద్రబాబు నాయుడు పొగాకు రైతుల కష్టాలు చూసి కేంద్రంతో మాట్లాడారని చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెం నాయుడు, మన జిల్లా మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి , ప్రజా ప్రతినిధులు కలిసి కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా గిట్టుబాటు ధరకు పొగాకు కొనాలని ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు, దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, ఏవో ప్రసాద రావు, తాళ్లూరు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వర రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబులు రెడ్డి, శాగం కొండారెడ్డి, షేక్ పెదకాలేషా వలి (బడే), పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-ఒంగోలు : యోగాంధ్ర -2025 మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని జడ్పి సమావేశ మందిరంలో ఆయన యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాంధ్ర క్యాంపెయిన్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, బిసి కార్పోరేషన్ ఈడి వెంకటేశ్వర రావు, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యం (మొదటిపేజీ తరువాయి)

ఎస్ఈ బాలశంకర రావు మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సాగర్ నీటితో అన్ని నీటి చెరువులను నింపుతున్నట్లు చెప్పారు. తాగు నీటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేసిందన్నారు. గుండ్లకమ్మ, రామతీర్థం, ఎలిగండ్ల ప్రాజెక్టల నుంచి జలజీవన్ పథకం కింద చేపట్టిన పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ పనులను కేంద్ర నోడల్ అధికారులు కూడా గురు, శుక్ర వారాలలో జిల్లాలో పర్యటించి పరిశీలించినట్లు చెప్పారు. డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ఉపాది హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం లో ఇప్పటివరకు రూ.54 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. జిల్లాలో పశువులకు నీటి తొట్టెలు, గోకులం షెడ్లు, ఫారం పాండ్స్ సోక్ పిట్స్ నిర్మాణాల పురోగతిని, పూడికతీత పనుల వివరాలను వివరించారు. 'పల్లె పండుగ' కార్యక్రమం కింది. చేపట్టిన పనులకు బిల్లులు వారం రోజులలో చెల్లిస్తామని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జి మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరు లక్ష్యాన్ని, జిల్లాలో 'లఖీ పతి 'దీదీ' లుగా మహిళలను తీర్చి దిద్దేందుకు అమలు చేస్తున్న ప్రణాళికను వివరించారు. డీఈఓ కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్కూల్స్ ప్రారంభించగానే "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామని, 'మన బడి మన భవిష్యత్తు' కార్యక్రమం కింది పాఠశాలలలో అవసరమైన పనులు చేపడతామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'అన్నదాత సుఖీ భవ పథకం కింద లబ్ధిదారుల ఖాతాలలో జూన్ 3వ వారంలో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందన్నారు. ఇటీవల వర్షాలకు పంటలు: దెబ్బతిన్న ఉద్యాన రైతులకు ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ రక్షిత మంచి నీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్లు సక్రమంగా పని చేసేలా పర్యవేక్షించాలని. సూచించారు. అవసర మైతే వచ్చే రెండేళ్లలో 100% ఆర్ఓ ప్లాంట్లు వచ్చేలా తాను చూస్తానన్నారు. రక్షిత మంచి నీటిని సరఫరా చేసి పైపు లైన్ల మరమ్మతులు / కొత్త వాటికి ఎంపీ ల్యాడ్స్ నుంచి ఒక కోటి రూపాయలు ఇస్తానన్నారు. ఇప్పటికి సచివాలయాలకు తాను ఇచ్చిన 15 ట్యాంకర్లను స్వాధీనం చేసుకుని వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. రాష్ట్రములో జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసి గడువును ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 2028 వరకు పెంచినందున ఈ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. రైతుల వద్ద పొగాకు నిల్వలు భారీగా ఉన్నందున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. కొత్త జడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్యకు తోడు సాగర్ నీటిని పంపిణీ చేసి. పైపు లైన్లు దెబ్బతిన్నందున కొత్త పైపులైన్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ లు అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణ పై మరింత దృష్టి పెట్టాలని అధికారులకు చెప్పారు. రామతీర్థం, గుండ్లకమ్మ కాలువలు బాగు చేయించాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. జూన్ నెలాఖరుకు పూర్తి చేయక పోతే నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం. ఉండదన్నారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు కలిగి, అడిగిన వారందరికీ ఎలాంటి పక్షపాతం లేకుండా పని కల్పించాలని అన్నారు. తన నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన నియోజకవర్గం లోని గురిజేపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు బొప్పాయి పంటను నష్ట పరిచారని, బాధిత రైతుకు పరిహారం అందేలా చూడాలని అధికారులను కోరారు. పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు మాట్లాడుతూ స్కూల్స్‌లో విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని కోరారు. చీమకుర్తి బాలికల హాస్టల్ లో భోజనం నాణ్యత పై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను, సూచనలను పరిగణనలోకి తీసుకుని "అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రస్తుతం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని యోగా సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జడ్పీ సీఈఓ మాట్లాడుతూ సవరించిన మార్గదర్శకాల మేరకు స్టాండింగ్ కమిటీ, మండల పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.5 లక్షల నుండి 10 లక్షలకు, జిల్లా పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.10 లక్షల నుంచి 25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. కొత్త జడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి గతంలో రూపొందించిన రూ.20 కోట్ల అంచనాలను సవరించేందుకు, గత రెండు స్టాండింగ్ కమిటీలలో ఆమోదించిన 350 ప్రతిపాదనలకు కూడా ఈ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. 'ముందుగా పహల్గాం ఉగ్ర దాడిలో అమరులైన వారికి నివాళిగా రెండు నిమిషాల పాటు ఈ సమావేశంలో మౌనం పాటించారు.

లాప్రోస్కోపీ ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల కేంద్రంలోని కర్నూల్ రోడ్ గల శ్రీరంగ మల్టీస్పెషల్టి ఆసుపత్రిలో లాప్రోస్కోపీ ఆపరేషన్ థియేటర్‌ను శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ శనివారం శ్రీశైలం వెళ్తూ దోర్నాల‌లోని శ్రీరంగ హాస్పటల్ నందు భవనంలో అత్యాధునిక పరికరాలతో దోర్నాల మండలం పరిసర ప్రాంతంలో ఎక్కడ లేని విధంగా లాప్రోస్కోపీ ఆపరేషన్ థియేటర్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శనివారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రి వైద్య సిబ్బంది మంత్రికి స్వాగతం పలికారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కాశి రావు, ఆసుపత్రి అందించనున్న వైద్య సేవలు గురించి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ,బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు శెగ్గం శ్రీనివాసులు, జిల్లా డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సూరిబాబు ,మరియు టిడిపి నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి షేక్ మాబు, దొడ్డ శేషాద్రి, చంటి ఈదర మల్లయ్య, షేక్ మంజూరు భాష, ఇరకసానీ దేవయ్య యాదవ్, మరియు టిడిపి నాయకులు,కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వినతి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఒంగోలులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అనేక సమస్యలను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ యర్రగొండపాలెం నుంచి ఒంగోలుకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు దీనిపై దృష్టిసారించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని కొత్త బోర్లు మంజూరు చేసి గ్రామాల్లో నీటి సమస్యను తీర్చాలని అధికారులను కోరారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొత్త రోడ్లు నిర్మాణం చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

క్రమం తప్పకుండా పెన్షన్‌ల పంపిణీ : డాక్టర్ గొట్టిపాటి

విశాలాంధ్ర -తాళ్లూరు: ఏడాది పాలనలో క్రమం తప్పకుండా పెన్షన్‌ల పంపిణీ కూటమి ప్రభుత్వానికే సాధ్యమని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మండలంలోని శివరామపురం గ్రామంలో శనివారం పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ ... ప్రతి అవ్వ , తాత మోములో ఆనందాన్ని చూడలన్నదే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పెన్షన్‌లు పంపిణీ మంజూరు చేస్తున్నారని చెప్పారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోనికి నెట్టివేసారని ఆరోపించారు. ప్రస్తుతం పాలన గాడిలో పెడుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. 2047 మిషనరీ మన సీఎం చంద్రబాబు , పీఎం మోదీజీ సహకారంతో ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. ఏడాది జూన్ నుండి రూ. 15వేలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఆగష్టు నుండి ఉచిత బస్సు ప్రయాణం కూడ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు, తాళ్లూరు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వర రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబులు రెడ్డి, శాగం కొండా రెడ్డి, షేక్ పెదకాలేషా వలి (బడే), పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్ బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి రాచకొండ వెంకట రావు, నీటి కమిటి వైస్ చైర్మన్ తూము శివ నాగి రెడ్డి, గొంది రమణా రెడ్డి (సమర), తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, రామయ్య, మాజీ ఎంపీటీసీ గాడిపర్తి లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు పొగాకు రైతులు ఆందోళన

విశాలాంధ్ర-కొండపి : స్థానిక పొగాకు వేలంకేంద్రంలో గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని పొగాకు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండపి పొగాకు వేలంకేంద్రం పరిధిలోని మూగ చింతల, నెన్నురుపాడు, గుర్రప్పడియ, చతుకుపాడు గ్రామాల నుండి శనివారం వేలానికి పొగాకు రైతులు తమ పొగాకుబేళ్లను తెచ్చుకున్నారు. వేలం కేంద్రంలో సుమారు 9 గంటలకు వేలం కేంద్రం అధికారి వేలాన్ని ప్రారంభించారు. పొగాకు వేలంలో వ్యాపారులు తమ పొగాకు సరైన గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని రైతులు 9:30 గంటల సమయంలో వేలాన్ని అడ్డుకొని నిలిపివేశారు. అనంతరం వేలంకేంద్రం ముందు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు మీద పొగాకు రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. పొగాకు వ్యాపారులు సిండికేట్ అయ్యి తమకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు బోర్డు వ్యాపారులపై ఒత్తిడి తీసుకొచ్చి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. పొగాకు రైతు సంఘం నాయకులు సైతం పట్టించుకోవడం లేదన్నారు. రైతు నాయకులు అని పేరు చెప్పుకుంటూ తమ పొగాకు బేళ్లను అధిగ ధరలు కొనుగోలు చేయించుకొని , తమ పబ్బం గడుపుకోవటం తప్ప రైతుల పక్షాన పోరాడే పరిస్థితి లేదన్నారు . అనంతరం బోర్డు అధికారులు రైతులతో చర్చలు జరిపి తిరిగి పొగాకు వేలాన్ని కొనసాగించారు. రైతులు ఆందోళన అనంతరం వ్యాపారులు దిగివచ్చి కొద్దిగా పొగాకు ధరలను పెంచడంతో రైతులు వేలాన్ని కొనసాగేలా సహకరించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల మండలంలోని అయినముక్కల గ్రామంలోని ఎస్సీ పాలెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమాన్ని ఒకరోజు ముందుగానే శనివారం అయినముక్కల గ్రామంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు స్వయంగా పాల్గొని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను పంపిణి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎరిక్షన్ బాబు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం, చంద్రబాబు నాయకత్వంలో పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా ఉదయం 7 గంటల నుండే పంపిణి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాల సర్పంచి చిత్తూరి హారిక, బట్టు సుధాకర్ రెడ్డి, షేక్. మాబు, వల్లపునేని కాశయ్య, దొడ్డ శేషాద్రి,ఈదరమల్లయ్య, చంటి, ఇరకసానీ దేవయ్య యాదవ్, చెన్నారెడ్డి, షేక్ మంజూరు భాష, షేక్ ఇస్మాయిల్, జనసేన మండల కన్వీనర్ కే మురళి, ప్రభుత్వ అధికారులు, ఎంపీడీవో నాసర్ రెడ్డి, మేజర్ పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలుగా గంగసాని

విశాలాంధ్ర-పామూరు : వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మీ ని నియమించారు. ఆమె భర్త గంగసాని హుసేన్ రెడ్డి వైసిపి మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. దంపతులు ఇద్దరు గత పది సంవత్సరాలకు పైగా వైసీపీ అభివృద్ధి కి అంకిత భావంతో కృషి చేస్తొన్నారు. గుర్తించిన అధిష్టానం రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా ఎంపిపిగా సేవలందిస్తున్న గంగసాని లక్ష్మిని నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా మీద ఉన్న నమ్మకంతో రాజకీయ ఎదుగుదలకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి, జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్, ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రీజినల్ కో-ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరావు లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

సీపీఐ గిద్దలూరు నియోజకవర్గం నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర - బేస్తవారిపేట : సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని రాచర్లలో జరిగిన సీపీఐ 6వ మహాసభలో ఎంపిక చేసినట్లు పార్టీ సీనియర్ నాయకులు ఢాకాల పుల్లయ్య తెలిపారు. నియోజకవర్గ కార్యదర్శిగా కేవీ రమణ, సహాయ కార్యదర్శిగా ఊరుమార్పు జోసెఫ్ లు, 23 మంది సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన చెప్పారు

మాజీ మంత్రి శిద్దా దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

విశాలాంధ్ర -తాళ్లూరు: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులకు నియోజకవర్గంలోని పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లూరు మండలం నుంచి జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో నాయకులు హాజరై ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

టిబి ముక్త పంచాయితీలుగా బొద్దికూరపాడు , లక్కవరం

విశాలాంధ్ర -తాళ్లూరు: క్షయ వ్యాధి రహిత పంచాయితీలుగా మండలంలోని బొద్దికూరపాడు, లక్కవరం గ్రామాలు ఎంపికయ్యాయి. బొద్దికూరపాడు పంచాయితీ సర్పంచి మందా శ్యామ్సన్‌కు జిల్లాలో నిర్వహించిన టీబీ ముక్తభారత్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ అవార్డును అందించారు. అవార్డు అందుకున్న సర్పంచిను ఉప సర్పంచి పులి ప్రసాద్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలతో పాటు ప్రజలకు మేలు చేసే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయటానికి తమ వంతు చేయూత అందిస్తామని ఈ సందర్భంగా సర్పంచి మందాశ్యామ్సన్ తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలోని లబ్ధిదారులకు శనివారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి పట్టణ అధ్యక్షుడు పెరుమాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ, జూన్ 1 ఆదివారం రావడంతో కూటమి ప్రభుత్వం ముందస్తుగానే ఈ నెల 31నే పింఛన్ల పంపిణీ చేపట్టింది. ఇది కూటమి ప్రభుత్వ ఆలోచనాశీలి పాలనకు నిదర్శనం అని అన్నారు. ఇదే నిజమైన ప్రజా సంక్షేమం, అంటూ ఆయన కూటమి పాలనను కొనియాడారు. పింఛన్ అందుకున్న వృద్ధులు, వికలాంగులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ మల్లిఖార్జున రావు, వేగినాటి శ్రీనివాస్, పువ్వాడ శ్రీనివాసరావు, పెరుమాళ్ళ మోహనరావు, ఎమ్మాడిశెట్టి ప్రసాద్, మేడం కిరణ్, చేదురి కిషోర్ ఎస్కే, వలి, నటుకుల బాల విరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు చేరుకున్న రామదండు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : స్థానిక కోదండ రామాలయంలో భక్తులు రామదండు యాత్రికులకు ఘనంగా స్వాగతం పలికారు. కొద్ది రోజులుగా మండలంలో శ్రీ రాముని భక్తులు శ్రీరాముని విగ్రహాలతో గ్రామాల్లో ప్రదర్శన నిర్వహిస్తుండగా శనివారం పుల్లల చెరువుకు చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు స్వామి వారికి ఎదురేగి మొక్కులు తీర్చుకున్నారు. కోదండ రామాలయం కమిటీ సభ్యులు కొర్లకుంట జానకీ రఘు, వెంకటసాయి కేబుల్స్ అధినేత డిష్ చిన్నా, సుదురుపాటి. వెంకోబరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలని వినతి

విశాలాంధ్ర-మార్కాపురం : ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాలలో పూర్తిగా వెనుకబడిన పశ్చిమ ప్రాంత కేంద్రమైన మార్కాపురంలో మైనారిటీ విద్యారంగ అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ (ఏపీఆర్ఎస్) మంజూరు చేయించాలని కోరుతూ పట్టణ టిడిపి మైనారిటీ వర్గానికి చెందిన ప్రతినిధి బృందం శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని వారి కార్యాలయంలో కలిశారు. ఏపీ ఆర్ జె సి స్కూల్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఉందని ఒక్క మన ప్రకాశం జిల్లాలో నేటి వరకు ఏర్పాటు చేయలేదని, కావున ఆ స్కూలు మార్కాపురం పట్టణంలో ఏర్పాటు చేయాలని మైనారిటీ ప్రతినిధి బృందం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కి వివరించారు. ఆర్థిక స్తోమత లేక చాల మంది మైనారిటీ వర్గానికి చెందిన పిల్లలు ప్రాథమిక విద్యకు సైతం దూరమవుతున్నారని, దీంతో వారి భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని ప్రతినిధి బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ స్కూలు పశ్చిమ ప్రాంతానికి ఎంతో అవసరమని ప్రతినిధి బృందం ఎమ్మెల్యే కు వివరించడం జరిగింది. మైనారిటీ ప్రతినిధి బృందం చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ స్కూల్ ఏర్పాటు ప్రాధాన్యత గురించి సంబంధిత శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీం, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎస్ కె. మౌలాలి,పార్టీ మైనారిటీ నాయకులు పఠాన్ హుస్సేన్ ఖాన్,ఎస్ కె షేక్షావలి,పెద్ద మసీదు ముత్త వల్లి మీర్జా సఫ్దర్ ఆలీ బెగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యశాల సందర్శన

విశాలాంధ్ర-పొన్నలూరు : స్థానిక ప్రాథమిక వైద్యశాలను శనివారం డిఎంహెచ్ ఓ డాక్టర్ టి వెంకటేశ్వర్లు వైద్యశాలలో రోగులు చికిత్స, వైద్య సిబ్బంది పనితీరు, మందులు సదుపాయాలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సీజనల్ వ్యాధి పట్ల అవగాహన, రోగులకు డిజిటలైజేషన్ రికార్డుల గురించి, ప్రాథమిక వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఓపి సమయంలో వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉండాలన్నారు, వైద్య సేవలపై నిర్లక్ష్యం చేయొద్దని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్లు రవి కిరణ్, కృష్ణ చైతన్య మరియు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెడబలిమి వివాహ వేడుకల్లో వైసీపీ నేతలు

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని చింతల పాలెం పంచాయతీ మోట్రావులపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు మెడబలిమి ముసలయ్య కుమార్తె సరోజిని వివాహ వేడుకల్లో జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుసేన్ రెడ్డి,దద్దాల శ్రీనివాసులు, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి, తుపాకుల ఆంజనేయులు రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉపాధ్యాయులు పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని 15 వ డివిజన్ రాంనగర్ 2,3 లైన్‌లలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, నగర మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు కొటారి నాగేశ్వరావు. కార్పొరేటర్ చింతపల్లి గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫించన్ దారులకు ఎంపి చేతుల మీదుగా ఫించన్ పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండల కేంద్రమైన పామూరు వెలిచి ఉన్న శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల పోస్టరును శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనలతో పట్టణములో జూన్ 5 నుంచి 13 వరకు అంగరంగ వైభవంగా జరిగే శ్రీ మదన వేణుగోపాల స్వామి బ్రహోత్సవాలుకు వేలాదిగా భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు హరిబాబు, అడుసుమల్లీ ప్రభాకర్ చౌదరి, పందిటి హరీష్, బొల్లా నరసింహారావు, , ఇర్రి కోటిరెడ్డి,మెంట నరసింహారావు, వాయునేని రాఘవ, నస్సం నాగేంద్ర చారి, సుబ్బారావు, సోమిశెట్టి శ్రీనివాసులు, మన్నెం రమణయ్య, గోల వీరబాబు, బండ్ల నారాయణ, రహమతుల్లా, గుత్తి మహేష్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి

విశాలాంధ్ర-ఒంగోలు : పద్మభూషణ్, నటశేఖర సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతి కార్యక్రమం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఉదయం సూపర్‌స్టార్ కృష్ణ కళా పరిషత్ అధ్యక్షులు జాలాది మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తొలుత కృష్ణ చిత్రపటానికి పలువురు పుష్ప మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవ సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ సంచలనాలకు, సాహసానికి మారుపేరు సూపర్ సార్ కృష్ణ అని చిత్ర రంగంలో సాంకేతిక విప్లవానికి ఆయన నాంది పలికారని, సినీరంగంలో కొత్తవారిని ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారికి చేయూతనిస్తూ తను ఉన్నంతకాలం తెలుగు చలనచిత్ర రంగానికి కొండంత అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి సూపర్ స్టార్ కృష్ణ ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి సంస్థ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, ప్రముఖ చిత్రకారుడు తిమ్మిరి రవీంద్ర, తిమ్మిరి శిరీష, పెరిక ఇమ్మానుయేలు, కత్తుల వెంకట ఆనందబాబు ,డివి సుబ్బారావు మెత్తాల్ల అభిషేక్, కె.సంపూర్ణ డి. సందీప్, పి. పేరయ్య పి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర-ఒంగోలు : అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తాలూకా సీఐ విజయ కృష్ణ హెచ్చరించారు. తాలూకా పరిధిలో అక్రమ ఇసుక రవాణా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా ఇసుకను తరలించడం వల్ల నదులు, వాగులు, ఇతర జల వనరుల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అక్రమ ఇసుక రవాణాకు ఉపయోగించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుకను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా వుంచడం జరుగుచున్నదన్నారు. ఉచిత ఇసుక పాలసీ విధానం అందుబాటులోకి వచ్చిన దృష్ట్యా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే సంబంధిత వాహనాలను సీజ్ చేయడం, అరెస్ట్ చేయడం, మరలా మరలా పట్టుబడితే వారిపై పిడి యాక్ట్ పెట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించండి

విశాలాంధ్ర -వెలిగండ్ల : ఫ్లోరైడ్ పశ్చిమ ప్రకాశం కనిగిరిలో అత్యధికంగా ఉంటుం డటంతో అప్పటి మాజీ పార్లమెంటు సభ్యులు వై వి సుబ్బారెడ్డి 2014లో వెలిగండ్ల మండలానికి ఆరో ప్లాంట్లు ఏర్పాటు చేశారని అవి ప్రస్తుతం పనిచేయడం లేదని వాటిని మూలకు పడవేశారని ఆ ప్లాంట్లను రిపేర్ చేయించి ఉంచితే ప్రజలు ఫ్లోరైడ్ నుంచి విముక్తి పొంది మంచినీరును తాగేందుకు అవకాశం లభిస్తుందని ప్రకాశం జిల్లా జడ్పిటిసి సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి శనివారం ఒంగోలులో జరిగిన జడ్పీ సమావేశంలో విన్నవించారు ప్రజలు కనిగిరి ప్రాంతంలో కిడ్నీ సమస్యలు అధికంగా ఉన్నందున ఈ సమస్యపై దృష్టి సారించి ఆర్ ఓ ప్లాంట్లను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని మినీ స్టేడియంలో ఆంధ్ర ప్రదేశ్ 12వ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాత ప్రసాద్, బెల్లం సత్యం, రంగ సాయి, గడ్డ వెంకటేశ్వర్లు,సౌత్ జోన్ సెక్రెటరీ కోటేశ్వర రావు, ప్రభాకర్, శ్రీమతి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ గంగసానిని అభినందించిన దద్దాల

విశాలాంధ్ర-పామూరు : వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా నియమించబడిన పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డిలను శనివారం కనిగిరి వైసీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, వెలిగండ్ల జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతి రెడ్డిలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అధ్వానంగా ఉప్పలపాడు రోడ్డు

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని ఉప్పలపాడు రోడ్డు అధ్వానంగా తయార్యయింది. రోడ్డు మొత్తం గుంతలు మయంగా ఉంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి గుంతలలో నీరు చేరడంతో రోడ్డు మొత్తం బురద మయంగా తయారయింది.దీంతో వాహనదారులు ఆ దారిలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.అధికారుల స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని ముప్పవరం గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గరిమిడి జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అద్దంకి ఎమ్మెల్యే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు శనివారం ముప్పవరం గ్రామంలోని ఎస్టీ కాలనీలో సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని జగన్ మోహనరావు తెలిపారు. అలాగే జూన్ 1 ఆదివారం కావడం వలన రాష్ట్ర ప్రభుత్వం అధికారుల ఆదేశాల మేరకు ఒకరోజు ముందే శనివారమే పెన్షన్లు పంపిణీ చేయడం జరిగిందని ముప్పవరం మహిళా కానిస్టేబుల్ కాటా అనంతలక్ష్మి తెలిపారు.ఒకరోజు ముందే పింఛన్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని పింఛన్‌దారులు వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా డాక్టర్ గణేష్ జన్మదినోత్సవం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ జన్మదినోత్సవాన్ని క్యాంపు కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఉదయం నుండి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు,నాయకులు పెద్ద ఎత్తున గుళ్ళపల్లి కార్యాలయానికి తండోపతండాలుగా చేరుకున్నారు. పూల దండలు, బొకేలు, శాలువాలతో గణేష్ దంప తులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ గణేష్ హాస్పిటల్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.అభిమానుల కోలాహలంతో ప్రాంగణమంతా నిండిపోయింది.అభిమానుల ఆనంద ఉత్సవాల మధ్య గణేష్ కేకును కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అభిమానులకు పార్టీ నాయకులకు,కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు .పార్టీ నాయకుల, కార్యకర్తల ఆదరణ ఇలాగే కొనసాగితే రాబోయే ఎన్నికలలో పార్టీ ఘన విజయం సాధిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అతిధులకు ఘనంగా విందును ఏర్పాటు చేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి నాయకులు చిత్రాల ఓబేదు, యార్లగడ్డ మదన్,ఇంకొల్లు రామకృష్ణ,కరేటి శేషగిరిరావు,వందల భాను ప్రసాద్,గాలిమోటు రాజశేఖర్,దళిత రాజ్యం బుజ్జి,పాపారావు,కాశీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

చీరాలనగర్‌లో పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - వేటపాలెం : వేటపాలెం గడియారం స్తంభం సెంటర్‌లో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే 31న పెన్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టడం శుభ పరిణామమని ఎంతో గర్వంగా చెప్పుకునే విషయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించడం సంతోషదాయకమన్నారు. ఒకరోజు ముందుగానే పెన్షన్ అందించడం ఎంతో ఆనందంగా ఉందని పెన్షన్ పొందిన లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారన్నారు. 31న పెన్షన్‌దారులకు అందరికీ 100 శాతం ఇచ్చే ప్రణాళిక రూపొందించామని,అందరికీ అందే విధంగా కృషి చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,తెలుగుదేశం,జనసేన,బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని చీరాలనగర్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ నెల 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడం వలన ఒక రోజు ముందుగా 31వ తారీఖునే ప్రభుత్వం పెన్షన్ ఇచ్చే ఆలోచన ఎంతో గర్వంగా చెప్పుకునే విషయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించడం సంతోషదాయకమన్నారు.ఒకరోజు ముందుగానే పెన్షన్ అందిస్తున్న ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని పింఛన్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానంపై అవగాహన కల్పించాలి : వెన్నెల

విశాలాంధ్ర - రేపల్లె : న్యాయస్థానానికి ప్రజలకు వారిధిగా పి.ఎల్.వీలు పనిచేస్తూ గ్రామాల్లో న్యాయ విజ్ఞాన శిబిరాలు మరిన్ని ఏర్పాటుచేసి ప్రజలలో ఉచిత న్యాయ విజ్ఞానం పట్ల అవగాహన కల్పించాలని రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.పి.డి వెన్నెల అన్నారు.శనివారం రేపల్లె న్యాయస్థానం హాల్‌లో రేపల్లె మండల పారా లీగల్ వాలంటీర్లకు, ప్యానల్ లీగల్, న్యాయవాదులకు, జాతీయ లోక్ అదాలత్ ఉచిత న్యాయ విజ్ఞాన శిబిరాలు నిర్వహణ వాటి వలన ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి జడ్జి అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల అధ్యక్షత వహించారు. గ్రామాల్లో ఉచిత న్యాయ విజ్ఞానం ఎలా పొందాలి ఇందుకు సంబంధించి గ్రామాలలో పంచాయతీ కార్యాలయాల వద్ద పి.ఎల్.విల పేర్లు, వారి మొబైల్ నెంబర్లతో సమాచార కేంద్రం వద్ద ప్రతి గ్రామంలో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని తగు సూచనలు చేశారు. న్యాయ విజ్ఞానం పట్ల ఏమైనా సందేహాలు ఉంటే కోర్టు అధికారిని అడిగి సమాచారం

తెలుసుకోవచ్చున్నారు. జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు తెలియజేసి అవగాహన కల్పించాలని ఇందుకు ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద, లేదా సచివాలయాల వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని పారా లీగల్ వాలంటీర్లకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విదేవి సాయిశ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గీతా భార్గవి, ప్యానల్ అడ్వకేట్లు కే.శ్రీవాణి,జి.కుమార్ బాబు,పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, ఆలా మోషే,ఎం.నాగమల్లేశ్వరరావు, సయ్యద్ తాహిర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండల కేంద్రం సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో 28వ రోజు శనివారం వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన 23 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. యోగాంధ్రలో కార్యక్రమంలో భాగంగా పిల్లలకు యోగా సనాలు గురించి అవగాహన కల్పించారు. త్వరలో స్కూళ్ల పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు లైబ్రరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ,గోపయ్య కల్యాణం

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ రామన్నపేట గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుప తమ్మ గోపయ్య స్వామి కళ్యాణం శనివారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారి పుట్టింటి వారైనా బలసల వారు ఆచార సాంప్రదాయములతో కూడిన పట్టు వస్త్రములు పసుపు కుంకు మలు బహూకరించారు. ఈ కళ్యాణంలో దంపతులు గుంటూరు విష్ణుకుమార్ శివపార్వతి ప్రత్యేక పూజా కార్యక్రమం జరిపారు. కళ్యాణ అనంతరం సుమారు 1600 మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. కమిటీ వారిచే దాతల సహాయ సహకారాలతో ఏర్పాటు చేశారు. సాయంత్రం రామన్నపేట పరిసర ప్రాంతాల్లో అమ్మవారి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామ ఊరేగింపు, మహిళలచే కోలాట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టింటి వారైనా బలసల రామలింగం, లక్ష్మీప్రసాదరావు, వేటపాలెం జడ్పిటిసి బండ్ల తిరుమల దేవి బండ్ల బాబు, బండ్ల శ్రీనివాసరావు, యారాసు అరుణ్ బాబు, నాసిక జగన్ చల్లా విజయ్, గుత్తి బాలసుబ్రమణ్యం, మహిళా మండలి అధ్యక్షులు గుమ్మడి సుశీల, మాజీ ఎంపీటీసీ పిచ్చుక సునీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన స్థానిక కౌన్సిల్ హాలులో శనివారం జరిగింది. అద్దంకి పట్టణ అభివృద్ధి పనులకు సంబంధించి ఎజెండాలో రూపొం దించిన 58 అంశాలను సమావేశంలో మున్సిపల్ ఆర్ఐ అర్జునరావు సభ్యులకు చదివి వినిపించారు.ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో అభివృద్ధి అంశాలను కౌన్సిల్ ఆమోదించినట్లు చైర్ పర్సన్ ఎస్తేరమ్మ తెలిపారు.సమావేశంలో కౌన్సిలర్లు, కమిషనర్ రవీంద్ర,మేనేజర్ శ్రీదేవి, మున్సిపల్ ఆర్ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల వద్ద యోగాసనాలు

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని మే 21 నుండి జూన్ 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆయా పంచాయతీల వద్ద, సచివాలయాల వద్ద యోగా కార్యక్ర మాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇందులో భాగంగా రేపల్లె మండలం పేటేరు గ్రామపంచాయతీ, ఆరవపల్లి గ్రామపంచాయ తీల వద్ద సర్పంచులు, ఉప సర్పంచ్లు, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ పెద్దలు యోగ అభ్యాస కులు నిర్వహించారు. ఎంపీడీవో ఏం.శోభారాణి పలు యోగాసనాలు ప్రదర్శించారు. యోగా సనాల్లో చాలామంది ఉత్సాహంగా పాల్గొని ఆసనాలు వేశారు.

రేషన్ సరుకులు పంపిణీలో నేతలు పాల్గొన్నాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మార్టూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆదివారం నుంచి రేషన్ షాప్‌లలో సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుంది.ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఆదివారం ఆయా గ్రామాలలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఆదేశాను సారం కనీసం 3 ఎఫ్.బి షాప్‌లను సందర్శిం చి అక్కడ సరుకుల పంపిణీలో పాల్గొనాలని తెలిపారు.అలాగే 65 సం. దాటిన వృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకు వెళ్ళి రేషన్ పంపిణీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాలలో నాయకులు విధిగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు.

ఘనంగా కృష్ణ జయంతి

విశాలాంధ్ర - చీరాల : తెలుగు సినీ లోకంలో తన విభిన్న నటనతో ప్రత్యేక గుర్తింపు పొందిన సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ జయంతిని పురస్కరించుకుని,ఆయన అభిమానులు చీరాల పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా చీరాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాలింతలకు పండ్ల పంపిణీ చేశారు.కృష్ణ అభిమాన సంఘం చీరాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది బాలింతలకు ఫలాలు, పౌష్టికాహారం అందజేశారు. మానవతా సేవలలో భాగంగా తీవ్ర ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఒక పేద కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించి ఉదారతను చాటారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ చీరాల శాఖ అధ్యక్షుడు షేక్ సలాం మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ నటుడిగా మాత్రమే కాదు, ఓ మంచి మనిషిగా ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపారు.ఆయన జయంతిని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం మాకు గర్వకారణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి, సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ

విశాలాంధ్ర - మార్టూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ప్రతి నెల నిరంతరం పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల చెరుకూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న 214 మందికి శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. నోవా గ్రూప్స్,గ్రీన్స్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు పంపిణీ చేసి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పెద్ద కాకాని శంకర్ కంటి ఆసుపత్రికి వైద్యులు,ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హర్షితకు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర - పర్చూరు : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూర్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్థానిక శాతవాహన హైస్కూల్లో చదివి 596 మార్కులు సాధించిన ఎన్.హర్షిత బాపట్ల జిల్లాలో మొదటి స్థానము లోను,స్టేట్ ఐదవ ర్యాంకు సాధించినది.మండలంలోని ఉప్పుటూరుకి చెందిన హర్షితకి రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు రూ.40,000 ఇంటర్మీడియట్ చదువుకు గాను ఆర్థిక సహాయం అందించగా, పర్చూరు ఈఓఆర్డి కొనసాని సత్యనారాయణ, వైస్ఎంపీపీ కోట ప్రసన్న చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అందజేశారు.పాఠశాల కరస్పాండెంట్ తేళ్ల వెంకటరామ ఆర్థిక చేయూత అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పాబోలు వెంకటేశ్వర్లు,పంబి సదానందరెడ్డి, కాసా అశోక్ కుమార్,కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బాపట్ల : అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించడం సంతోషదాయకమని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు.పట్టణంలోని 24వ వార్డు ఇమ్మడిశెట్టివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పెన్షన్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ 1వ తేదీన ఆదివారం సెలవు కావడం వలన ఒక రోజు ముందుగా 31నే పెన్షన్ ఇచ్చే ఆలోచన ఎంతో గర్వంగా చెప్పుకునే విషయమన్నారు.ఒకరోజు ముందుగానే పెన్షన్ అందిస్తున్న ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని పెన్షనర్లు తెలియజేస్తున్నారన్నారు. 31వ తేదీనే పెన్షన్ తీసుకుంటున్న అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి,వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కుట్టుబోయిన రమేష్,అధికారులు,తెలుగుదేశం,జనసేన,బిజెపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల మరమ్మతు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - వేమూరు : గత ఐదేళ్ల కాలంలో సాగునీటి కాలువలు మరమ్మతులు చేపట్టక రైతులు పంటలు సాగు చేసుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేసి కాలువల మరమ్మతు పనులను ప్రారంభించడం జరుగుతుం దని వేమూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దండే వెంకట సుబ్బారావు తెలియజేశారు.శనివారం ఆయన మండలంలోని చావలి గ్రామంలో సాగునీటి కాలువ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది సంఘాల పరిధిలో పూడికల తీతతో పాటు తూటి కాడ తొలగింపు చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వంలో ప్రత్యేక గ్రాంటును సాగునీటి కాలువల మరమ్మతులకు ఏర్పాటు చేశారన్నారు. తద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతాంగం సమస్యల పరిష్కారంపై ఎంతటి చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. నీటిపారుదల శాఖ ఏఈ రవికుమార్ మాట్లాడుతూ వేమూరు వన్,వేమూరు టు పెనుమర్రు,పెరవలి సంఘాల పరిధిలోని 11 పనులకు గాను రూ.46 లక్షలు కేటాయింపు జరిగిందన్నారు. వేమూరు వన్ పరిధిలో మెయిన్ కెనాల్,వేమూరు టు పరిధిలో వేమూరు, బలిజేపల్లి, చావలి,అద్దేపల్లి బ్రాంచీల పరిధి అలాగే పెనుమర్రు సంఘం ద్వారా బలిజేపల్లి,పెరవలి సంఘం పరిధిలో పెరవలి ఓల్డ్ కొల్లిపర బ్రాంచి పెరవలి న్యూ బ్రాంచ్ల పరిధిలో పనులను ప్రారంభించామన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ద్వారా కొల్లిపర ఛానల్ కింద కొల్లిపర నుండి చక్రాయపాలెం వరకు ప్రత్యేకంగా రెండు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు డైరెక్టర్లు తెలుగు రైతు నాయకులు గోపాలం సుబ్బారావు, లంకోజి నాగమల్లేశ్వరరావు,నీటిపారుదల శాఖ సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూదానంపై హర్షాతిరేకాలు

- ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన జడ్పీటీసీ సుబ్బయ్య
- రూ.5 లక్షల విలువ చేసే స్థలం కేటాయింపు
- సుబ్బయ్య దాతృత్వానికి అధికారులు, ప్రజలు ఫిదా

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఎవరో వస్తారు,ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మనకు చేతనైనంతలో పరులకు సేవ చేయాలని ఓ మహాకవి అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య.ఆముదాలపల్లి పంచాయతీ పరిధిలోని ముంద్రేడు గ్రామంలో తాగునీటి సమస్య జటిలంగా మారింది.స్థానిక గ్రామ ప్రజలు గతంలో ఎన్నో సార్లు అధికారులకు వినతులు సమర్పించిన ఫలితం లేకపోయింది.దీంతో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ అనగాని నేత శివప్రసాద్‌ల సహకారంతో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య చొరవతో మంచి నీటి సంపు నిర్మాణం కాబోతోంది.దీంతో మంచి నీటి సంపు ఏర్పాటు కోసం డబ్ల్యూఎల్ఎఫ్ వాటర్ అండ్ లైవ్లీ హుడ్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నిధులు కూడా మంజూరయ్యాయి.అయితే నీటి సంపు నిర్మాణం కోసం అనువైన స్థలం లేక పోయింది.ఈ తరుణంలో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య నేనున్నానం టూ భూ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. సుమారు రూ.5 లక్షల విలువైన తన సొంత భూమిని మంచి నీటి సంపు నిర్మాణానికి ఇచ్చి ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదిం చుకున్నారు. ముంద్రేడులో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కానుంది.డబ్ల్యూఎల్ఎఫ్ వాటర్ అండ్ లైవ్లీ హుడ్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో రూ. 22 లక్షల నిధులు మంజూరు చేశారు.ఈ నిధులతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్, వాటికి అనుసంధానంగా నీటి సంపు నిర్మాణం చేపట్టనున్నారు. అదే విధంగా ఆ ప్రాజెక్టు నిర్మాణం కోసం అయ్యే విద్యుత్ ఖర్చులు రూ.5 లక్షలను జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య సమకూర్చారు.

జడ్పీటీసీ సుబ్బయ్యకు అభినందనల వెల్లువ

ముంద్రేడులో మంచినీటి సంపు ఏర్పాటులో ప్రత్యేక చొరవ తీసుకుని కీలకపాత్ర పోషించిన నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్యపై గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నీటి సంపు ఏర్పాటుకు నర్రా సుబ్బయ్య తన సొంత భూమిని ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. భూ దానంపై విశాలాంధ్ర రిపోర్టర్ జడ్పీటీసీ సుబ్బయ్యను సంప్రదించగా ప్రజలకు ఉపయోగపడే ఒక మంచి పనిలో తాను భాగస్వామిని కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు.

దేవస్థానం భూముల కౌలు వేలం

విశాలాంధ్ర - జె పంగులూరు : జె.పంగులూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని భీమలింగేశ్వరస్వామి,శ్రీ వీరేశ్వరస్వామి దేవస్థానాల భూముల కౌలుకు శనివారం పంగులూరు గ్రామంలో వేలంపాట నిర్వహించారు. దేవాదాయ శాఖ అద్దంకి పరిశీలకులు ఎం.వెంకటేశ్వరరావు వేలంపాట నిర్వహించగా స్థానిక రైతులు వేలంపాటలో పాల్గొన్నారు. అయితే గతంలో కంటే ఈ సంవత్సరం కౌలు వేలం తగ్గిందని పరిశీలకులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు,మేదరమెట్ల ఈవో జి.వాసుబాబు,రైతులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే పల్లెనిద్ర

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చీరాల మండలం విజయ నగర్ కాలనీలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చీరాల డిఎస్పీ మొహమ్మద్ మోయిన్ మాట్లాడుతూ ప్రజల భద్రతకే ప్రాధాన్యం ఇస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజ లందరూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల రెండవ పట్టణ సీఐ నాగభూషణం,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ట్రైనింగ్ పూర్తి చేసుకున్న లబ్దిదారులకు పట్టణ బిజెపి నాయకులు పిన్ని సాంబశివరావు సమక్షంలో వివిధ రకాల పనిముట్లు పంపిణీ చేయటం జరిగింది.ఇందులో చేపల వలలు, కూలింగ్ బాక్సులు,బిస్కెట్ మేకింగ్, ఫ్లవర్ డెకరేషన్ వంటి పనిముట్లు శిక్షణ పూర్తి చేసుకున్న లబ్దిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సైకం రాజు,మోపిదేవి శ్రీనివాసరావు, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది వెంకటస్వామి, నారాయణ, అభిలాష్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - యద్దనపూడి : వైద్యరంగంలో శివ ప్రసాద్ సేవలు మరువలేనివని డాక్టర్ శ్రీహర్ష అన్నారు.స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తూ విరమణ పొందిన టీఎన్‌వీ ప్రసాద్ దంపతులను హాస్పటల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 దశాబ్దాలకుపైగా సుదీర్ఘ కాలం వివిధ హోదాలలో పని చేసి మనలను పొందారని, సీఐటీయూసీ, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ పదవులు చేసి అందరి మనన్ని పొందిన వ్యక్తిని అన్నారు. 2019 లో ప్రకాశం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా, 2023 లో బాపట్ల జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ఉత్తం అధికారిక అవార్డు అందుకున్నారన్నారు.ఈ కార్యక్రమం మార్టూరు,యద్దనపూడి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు : ఆర్ ఎస్ ఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు ఒంగోలు డిఆర్ఎం ఎం మున్సిపల్ హై స్కూల్‌లో విద్యార్థులకు ఏప్రిల్ 28 నుండి మే 31వ తేదీ వరకు ఉచితంగా సమ్మర్ క్యాంపు నిర్వహించినట్లు కమిటీ నిర్వాహకులు చిక్కాల కిరణ్ కుమార్ తెలిపారు. ఆటలు పోటీలో విజేతులకు రాష్ట్ర కమ్మ సేవ సమాఖ్య చైర్మన్ మండవ మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. శనివారం సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి శిబిరాలు విజ్ఞానదాయకమని తెలిపారు. ఈ వేసవికాలములో విద్యార్థులు టివి,సెల్ ఫోన్ లకు బానిసలు కాకుండా వారిలోని సృజనాత్మకతను బయటకి తీయడానికి సెల్ఫ్ డిఫెన్స్ సైన్స్ ప్రయోగాలు మిచ్చన్ మార్షల్ ఆర్ట్స్ డైనమిక్ ఫిట్నెస్ తో పాటుఆటలు యోగ నేర్పించడం మహనీయుల జీవితాలను పరిచయం చేయడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డేంపూడి సుజాత రావు సేవ్ ది అనిమల్ ఫౌండేషన్ ప్రతినిధులు తాడిపత్రి దివ్య, కోసూరి శ్రీదేవి మండవ సుబ్బారావు గోపి. ఏడు కొండలు మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

పాధ్యాయ వృత్తినే దైవంగా భావించాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావించి పసిపిల్లలకు 38 సంవత్సరాలుగా విద్యాబుద్ధులు నేర్పిన అత్యంత సహృదయత గల ఉపాధ్యాయులలో మల్లికార్జున రాజు మొదటి వరుసలో ఉంటారని సిఎస్పురం ఎంఈఓ జె ప్రసాద రావు కొనియాడారు. రెడ్డి గారి పల్లి పాఠశాలలో శనివారం పదవీ విరమణ చేసిన జి మల్లికార్జున రాజుకి గ్రామస్తులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎస్పురం ఎంఈఓ జె ప్రసాద రావు పాల్గొన్నారు. గ్రామ పెద్ద అంబాల చిన్న వెంకట రెడ్డి మాట్లాడుతూ మొదటి నుండి రాజు పిల్లల పట్ల దయార్ద్ర హృదయులని, పాఠశాలను దేవాలయంగా భావించే వారని వారి సేవలు కొనియాడారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారు ముప్పై ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహించారని, విద్యార్థులకు బోధన చేశారని, ఏపీటీఎఫ్ సంఘంలో కీలకంగా పనిచేశారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు అంబాల చంద్ర శేఖర్, మాజీ సర్పంచ్ జి శ్రీనివాసులు రాజు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నాగార్జున, నారాయణ, పెద్ద సిద్దయ్య, నాగయ్య మరియు ఉపాధ్యాయులు వెంకట సుజాత తోట శ్రీనివాసులు, జె ఎస్ ఆనంద్ బాబు, పఠాన్ నాయబ్ రసూల్, బి శివప్రసాదాచారి, పి మాలకొండయ్య, సిహెచ్ సునీత దేవి, ఎలికా శ్రీనివాసులు, రంగ నాయకులు, యోగి రాములు, ఖాజా హుస్సేన్, ఖాజా రహంతుల్లా, మస్తాన్ వలి, చెన్నయ్య , జి పుల్లయ్య, కె రామ సుబ్బారావు, కె రవీంద్ర నాథ్, ముప్పాళ్ళ ప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలి

విశాలాంధ్ర నాగులుప్పలపాడు: పిడిఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన యార్ల మహాలక్ష్మి సన్మాన సభ స్థానిక మండల పరిషతు కార్యాలయంలో ఎంఇఓ తిరుమలశెట్టి రవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఏ బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగికి ఎల్లప్పుడు ప్రజల్లో ప్రత్యేక గుర్తిం పు లభిస్తుందన్నారు. అదే కోవలోనే శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన మహాలక్ష్మి ఎంపిడిఓగా ప్రకాశం జిల్లాకు వచ్చి అనేక ప్రాంతాలలో పనిచేసి తన ఉద్యోగ బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. తొలినాళ్లలో ఎంపిడిఓ గా మహిళా ఉద్యోగి మహాలక్ష్మిని నాగులుప్పలపాడు మండలానికి సిఫారసు చేసిన సమయంలో ఆమె సమర్థవంతంగా పనిచేయగలదా అన్న సందేహం ఉండేదని విధుల్లో మహాలక్ష్మి నిబద్ధత, కృషిని చూసి ఆమెపై నమ్మకం పెరిగిందన్నారు. గ్రామీణాభివృద్ధి, ప్రజల సంక్షేమం, పరిపాలనలో ఎంపిడిఓ మహాలక్ష్మి చూపిన నిబద్ధత, నిజాయితీ, సమస్యల పరిష్కారానికి చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. కష్టపడి పనిచేసే తత్వం, ప్రజల పట్ల నిస్వార్థ సేవ మహాలక్ష్మి తత్వమన్నారు ప్రజల సమస్యలను ఓపికగా వింటూ వాటి పరిష్కారానికి అవిశ్రాంత కృషి చేశారని కొనియాడారు. విధుల్లో ఆమె చూపిస్తున్న అంకితభావం ఆమెపట్ల ఎంతో గౌరవాన్ని పెంచిందన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగికి సహజమన్నారు.గత 30 ఏళ్లకు పైగా అనేక ప్రాంతాలలో ఎంపిడిఓగా ప్రజలకు సేవలందించిన మహాలక్ష్మి ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషం గా, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ మహిళా ఉద్యోగి ఎంపిడిఓ మహాలక్ష్మి పురుషులతో సమానంగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించడం జరిగిందన్నారు. గ్రామీణాభివృద్ధి పై మక్కువ ఉండటంతో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేసేవారన్నారు. సాటి ఉద్యోగులకు మార్గదర్శిగా నిలిచారన్నారు. మాజీ ఎంఎల్ఏ కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ ఎంపిడిఓ మహాలక్ష్మికి మండల అభివృద్ధిపై ఆదర్శనీయమన్నారు. .విధుల్లో ఆమె చూపిస్తున్న అంకితభావం ఆమెపట్ల ఎంతో గౌరవాన్ని పెంచిందన్నారు. మాజీ ఎంఎల్ఏ కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ ఎంపిడిఓ మహాలక్ష్మికి మండల అభివృద్ధిపై ఎం తో అవగాహన ఉందన్నారు. ఉద్యోగులతో పాటు, మండల ప్రజల మన్ననలను పొందారని అన్నారు.అనం తరం ఉద్యోగ విరమణ పొందిన యార్ల మహాలక్ష్మి మోహన్ కుమార్ దంపతులను ఎంఎల్ఏ బి. విజయకుమార్, మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు, మాజీ ఎంఎల్ఏ కసుకుర్తి ఆదెన్న ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.ప్రవీణ్ కుమార్, ఇఓఆర్డి మురళీ, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, ఒమ్మెవరం సర్పంచిన పాలపర్తి బాలకోటి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

విశాలాంధ్ర - కనిగిరి : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ బంగారం ధరలు భారీగా పెరుగు తున్న నేపధ్యంలో అవసరం లేని బంగారాన్ని ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రంగా ఉంచుకోవాలని, ఇంటికి ధృడమైన తాళాలు, గ్రిల్స్ వాడాలని, ఇంటి ముందు, గేటు దగ్గర సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు అమర్చుకోవా లన్నారు. అదే విధంగా ఎవరైనా కొత్త వారు ఇంటికి వస్తే వారిని పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే ఇంట్లోకి అనుమతించాలన్నారు. పరిచయం లేని వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తే వెంటనే 100/112 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. వేడుకలు లేదా షాపింగ్ కోసం వెళ్తున్నప్పుడు ఎక్కువ మొత్తంలో బంగారం ధరించడం నివారించాలన్నారు. ఎక్కువ మొత్తంలో బంగారం బస్సుల్లో మరియు ఇతర వాహనాల ప్రయాణం చేసేటప్పుడు మీరు పెట్టిన బంగారు ఒక బ్యాగ్‌ను తరచుగా గమనించాలన్నారు. బంగారం మెరుగు పెడతామని ఇళ్ల వద్దకు వచ్చే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారిని నమ్మకపోవడం మంచిదని డీఎస్పీ ఈశ్వర యశ్వంత్ తెలిపారు.

ఈద్గాను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - పొదిలి : ఈనెల మొదటి వారంలో ముస్లింల బక్రీద్ పండగ సందర్భంగా వారు ప్రత్యేక ప్రార్ధనల కోసం ఏకమయ్యే ఈద్గాను శనివారం పొదిలి మున్సిపల్ కమిషనర్ కె యల్ నారాయణరెడ్డి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు పండగ జరిపే రోజున పరిశుభ్రంగా ఉండాలని ఎలాంటి దుమ్ము ధూళి దుర్వాసన కలుషితం లేకుండా వాతావరణ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్టుగా తెలిపారు. అంతే కాకుండా బిడ్డీల దగ్గర తోపుడుబండ్ల వ్యాపారులు, పండ్ల వ్యాపారులు, చికెన్, మటన్ వ్యాపారస్తులు వ్యర్థాలను పడవేస్తున్నారని దీంతో దుర్వాసన వెదజల్లుతుందని, అలా ఎక్కడ పడితే అక్కడ పడవేయకూడదని, కాలువలు కూడా బూడిపోయే అవకాశం ఉందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ వ్యాపారులు కాలవలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఇది మరి బాధ్యత అని తెలిపారు ముస్లింల స్మశాన వాటికను కూడా పరిశీలించారు.

ఆటో ఇంజన్ టైర్లు అపహరణ

విశాలాంధ్ర-పీసీపల్లి : యాక్సిడెంట్‌కు గురైన ఆటో ఇంజన్ ముందు టైరు గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటన పెద్ద అలవల పాడు పంచాయతీ పరిధిలోని పంచలింగాలకొండ వద్ద చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే గత నెల 26న పెద అలవలపాడు గ్రామానికి చెందిన కుందుర్తి రాము వలేటివారిపాలెం నుండి అలవలపాడు వస్తుండగా బేస్తవారిపేట మండలం సోమరాజుపేట గ్రామానికి చెందిన సిహెచ్ బ్రహ్మయ్య బేస్తవారిపేట నుండి నెల్లూరు వెళు తుండగా పంచలింగాల కొండ వద్ద ఆటో బైక్ ఎదురెదురుగా ఢీకొట్టగా ఆ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ కుందుర్తి రాముకు మూడు చోట్ల నరాలు తెగిపోవడంతో కనిగిరిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతుండగా యాక్సిడెంట్ జరిగిన ప్రదేశంలోనే ఆటోను ఉంచారు. అయితే శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆటో వెనుక భాగంలో గేర్ బాక్స్ ఇంజన్ ముందు భాగంలోని టైరును అపహరించుకు వెళ్లిపోయారు. సంఘటనా స్థలంలో పోలీస్ శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ దుండగులు ముందుగా పసిగట్టి సీసీ కెమెరా ధ్వంసం చేసి ఈ దారుణానికి పాల్పడ్డారు. యాక్సిడెంట్లో గాయాలపాలై హాస్పి టల్లో చికిత్స పొందుతున్న ఆటో బాధితునికి దుం డగులు ఇంజన్ గేర్ బాక్స్ టైరు అపహరించుకొని పోవడంతో వాటి విలువ రూ.1 లక్షదాక ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఆరు రోజుల నుంచి యాక్సిడెంట్‌కు గురైన ఆటో అక్కడే ఉండడంతో దుండగులు పక్కాగా రెక్కీ నిర్వహించి అర్ధరాత్రి సమయంలో అపహరించుకుపోయినట్లు తెలుస్తోంది.

యోగాతో ఆరోగ్యం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానికమండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల స్థాయిలో జరిగే ఘనంగా యోగా శిక్షణా తరగతులు శనివారంతో ముగిసినవి. సంతనూతలపాడు ఎంపీడీవో డి సురేష్ బాబు వీటిని పర్యవేక్షించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఏ కరుణాకర్, ఉపాధ్యాయులు పిఎంకె. ఆత్రేయులు యోగ పై శిక్షణలో పలు పదర్శనలు ద్వారా వివరించారు. యోగా ద్వారా మానసిక శారీరక ఆరోగ్య సంరక్షణ కలుగునని రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ కరుణాకర్ ఆత్రేయులు అన్నారు . ఈ శిక్షణ పొందిన సచివాలయ ఉద్యోగులు గ్రామ సచివాలయాల్లో ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాలని ఎంపీడీవో. సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి ఎంరమణమ్మ గ్రామ సచివాలయాల కార్యదర్శులు సచివాలయం పలు శాఖల సిబ్బంది యోగా శిక్షణలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు శ్రీకారం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా మండలం లోని ఉపాధ్యాయులు సుమారు 189 మంది బదిలీలకు అప్లై చేసుకున్నారనీ వారిలో యస్ జి టీ లు 98 మంది, స్కూల్ అసిస్టెంట్లు 82 మంది, పి యస్ ప్రధానోపాధ్యాయులు 9 మంది, వీరిలో 98మంది తప్పని సరిగా బదిలీ కావలసి వున్నారనీ యంఇఓ ఆంజనేయులు తెలిపారు. ప్రాథమిక ప్రధానోపాధ్యాయులలో 9 మందిలో 8 మంది యితర మండలాలకు బదిలీ పై వెళ్లారనీ, గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు 5 మంది యితర మండలాలకు వెళ్లి 5 మంది యితర మండలాల నుండి పదోన్నతి ద్వారా రావటం జరిగిందనీ తెలిపారు. బదిలీ అయిన వారు రేపు విధులలో జాయిన్ అవ్వాలని ఎంఇఓ తెలిపారు. ఈ రోజు నుండి స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్ ద్వారా బదిలీలకు అప్లయ్ చెయ్యాలి. తర్వాత యస్ జీ టీ లు స్కూల్ అసిస్టెంట్ లు గా పదోన్నతులు, 5 నుండి ఎస్ జీటీ ల బదిలీ లు జరుగుతాయని ఆయన తెలిపారు. బదిలీ పై వెళ్ళే వారికి ఆయన శు భాకాంక్షలు తెలిపారు.

శాస్త్ర,సాంకేతిక రంగాలలో నైపుణ్యాభివృద్ధికి లెక్కలు, ఇంగ్లీషు ఎంతో దోహదం

విశాలాంధ్ర-ఒంగోలు : శాస్త్ర సాంకేతిక రంగాలలో నైపుణ్యాభివృద్ధిని సాధించాలంటే లెక్కలు ఇంగ్లీషులో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పీపుల్స్ ఎన్విరాన్మెంట్ మాసపత్రిక సంపాదకుడు పుత్తూరు నారాయణరావు, ఒంగోలులోని ప్రగతి మెడికల్స్ అధినేత ఎల్లమూరి రామయ్య స్పష్టం చేశారు. శనివారం ఆసరా ఆధ్వర్యంలో జరిగిన తొమ్మిది పది తరగతుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మద్దిపాడు మండలంలోని, మారెళ్ళ గుంట పాలెం ఆసరా కేంద్రంలో సభ నిర్వహించారు. ఈ సభకు ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కొత్తూరు నారాయణ మాట్లాడుతూ నేడు శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచం వేగంగా ముందుకు పోతుందని భారతదేశం పోటీ లో నిలవాలంటే చదువులో ప్రత్యేకించి ఇంగ్లీషు లెక్కలలో ప్రావీణ్యం సంపాదించాలని కోరారు. రామయ్య మాట్లాడుతూ విద్యలో నైపుణ్యం సంపాదించాలని అబ్దుల్ కలాం, బాబాసాహెబ్ అంబేద్కర్‌లను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కామరాజు నాడార్ చదువు లేకపోయినా విద్యను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువు నేర్పించుటకు కృషి చేశాడని గుర్తు చేశారు అందువల్ల చదువు లేని వారిని కించపరచరాదని వారు చదువుకునేట్లు ప్రోత్సహిం చాలని కోరారు. సభలో రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ ,జిల్లా సిపిఐ సీనియర్ నాయకులు యు ప్రకాష్‌రావు ,పెద్దకొత్తపల్లి హెడ్మాస్టర్ ,ముప్పరాజు అన్నపూర్ణ, చంద్రమౌళి,ఎం కృష్ణయ్య ,తదితరులు ప్రసంగించారు.పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్ పోతినేని బుచ్చయ్యను. ఆసరా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సిపిఐ నాయకులు యు ప్రకాష్‌రావు సత్కరించారు.వారితో పాటు జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెడ్మాస్టర్ సమ్మర్ కోచింగ్ కు శిక్షణ నిచ్చిన లెక్కలు మాస్టర్ చంద్రమౌళిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పదవ తరగతి చదువుతున్న బి ప్రణీత్ బాలికల విభాగంలో నేహా చౌదరి లకు నలదల వెంకటకృష్ణారావు, సిహెచ్ వెంకటేశ్వర్లు ప్రథమ బహుమతులను అందజేశారు.9వ తరగతిలో శిక్షణ పొందిన లోకేష్ ,బాలికల విభాగంలో నిహారిక కు నా తాని రఘురామయ్య, పుత్తూరు నారాయణరావు ప్రథమ బహుమతిని అందించారు. పదవ తరగతి 9వ తరగతి లో శిక్షణ పొందిన మస్తానమ్మకు, వి సింగయ్య,గాయత్రీ కిరణ్ కు శివ నాగేశ్వరరావు ద్వితీయ బహుమతులను అందజేశారు.అరుణ్ నందిత లకు కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు చివరగా శిక్షణ శిబిరానికి ఆర్థిక సహాయం చేసిన దాతలు అందరకు, అదేవిధంగా నెలరోజుల పాటు విద్యార్థిని, విద్యార్థులకు ఆహార సదుపాయాలు కల్పించిన ఆసరా కేంద్రం సిబ్బందికి, ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతు లకు ఆర్థిక సహాయం చేసిన నలదల వెంకటకృష్ణారావు ,వారి సోదరులకు ఆసరా తరపున ఎంసీ వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలియజేశారు.

యోగాతో ఆరోగ్యం : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : యోగ సాధన వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని,అందరూ యోగ సాధన చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శనివారం యోగాంధ్ర క్యాంపెయిన్లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన భారతదేశం గర్వించదగినటు వంటి ప్రక్రియ యోగా ప్రక్రియ అన్నారు.మన పూర్వీకులు, మహర్షులు వేల సంవత్సరాల క్రితం యోగాను అభివృద్ధి చేసి ఒక పార్యాంశంగా ఒక పరంపర కొనసాగే విధంగా ప్రపంచానికి అందించారన్నారు. యోగ అనే ప్రక్రియను సంకల్పించుకొని తమ జీవితంలో దైనందిన భాగంగా చేసుకోవాలన్నారు. జీవితకాలం అంతా ఈ యోగాను అనుసరిస్తూ, చేస్తూ వారి జీవితాన్ని ఆరోగ్య పరంగా తీర్చిదిద్దుకోవడానికి పనికివచ్చే సాధన అన్నారు.సైన్సు, సాంకేతికత లేని రోజులలో మన పూర్వీకులు వేల సంవత్సరాల క్రితం దీనిని ఎలా అభివృద్ధి చేశారు. అనేది మనందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. వారు ఆ రోజుల్లో ఏ విధమైన ఆచార వ్యవహారాలలో ఉన్నారో, ఏ విధమైనటువంటి పరిస్థితులు ఇటువంటి గొప్ప ప్రక్రియను కనిపెట్టడానికి దోహదం చేశాయో ఈ ప్రక్రియ ఒక పరంపరగా మన దేశంలో పౌరులందరికీ సంక్రమిం చిందన్నారు. మంచి ఆరోగ్యాన్ని, మంచి జీవన సరళిని మెరుగుపరుచు కోవడానికి యోగాను అలవర్చుకోవాలన్నారు.యోగ సాధన వల్ల ఇమ్యూనిటీ శక్తి పెరుగుతుందన్నారు. జీవనశైలిలో వైరస్,బ్యాక్టీరియా,ఫంగస్,ప్రోటోజువా మొదలగు వాటి వలన సంక్రమించే వ్యాధులను ఈ యోగా సాధన వలన కొంతవరకు ఎదుర్కోవచ్చన్నారు. సూక్ష్మ క్రిముల దారణకు కారణం కానీ క్యాన్సర్, బిపి, షుగర్, గుండె జబ్బులు,కీళ్ల నొప్పులు, వెన్నుపూస సంబంధిత వ్యాధులను యోగా ద్వారా తగ్గించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బహిరంగంగా నిర్వహించుకోవడంలో ప్రజల దృష్టిని యోగా వైపు మరల్చి వారి ఆరోగ్యాన్ని కాపాడే సదుద్దేశంతో నిర్వహిస్తున్నామన్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. భారతదేశాన్ని 2047నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలని భారత ప్రభుత్వం ఆశయం అని ఆయన తెలిపారు.దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యం అని ఆయన తెలిపారు. స్వర్ణాంధ్రతో పాటు యోగాంధ్రను అనుసంధానించి అభివృద్ధితో పాటు ఆరోగ్యపరంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశం అని అన్నారు. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించు కుంటున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. ఆస్తమా, క్యాన్సర్ వంటి ప్రాణాం తకమైన వ్యాధులు వస్తాయని, అందుకు పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలతో జీవితాన్ని ఎంచుకో పొగాకును కాదు అనే అంశంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ,పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, బాపట్ల రెవెన్యూ డివిజ్ అధికారి పి. గ్లోరియా,ఇతర అధికారులు, యోగా గురువులు,విద్యార్థులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆదెమ్మ చిత్రపటానికి ఘన నివాళి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని మన్నం వారి పాలెం గ్రామ టీడీపీ నాయకులు అద్దేపల్లి కోటమరాజు తల్లి ఆదెమ్మకు తన నివాసం వద్ద దశదిన పెద్దకర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్ పాల్గొని ఆదెమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే విజయ్ కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఆదెమ్మ కుమారులు కోటమరాజు వెంకటేశ్వరరాజు వెంకట సుబ్బరాజు లకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మాజీ సర్పంచి రంపతోటి అంకారావు మాజీ జెడ్పిటిసి తన్నీరు శ్రీనివాసరావు మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్దన్ గ్రామ టిడిపి అధ్యక్షులు బొడ్డు శంకర్ బాబు మాజీ సర్పంచి బొమ్మినేని సుబ్బారావు మాజీ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీ రామమూర్తి టిడిపి నాయకులు చిట్టం శెట్టి శ్రీనివాసరావు ఎస్ కె నాయబ్ రసూల్ చెరుకూరి శ్రీనివాసరావు రామకృష్ణారెడ్డి మార్పుడి అంజయ్య కొప్పోలు శ్రీనివాసరావు మద్దిరాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై సమీక్ష

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా యోగాంధ్ర కార్యక్రమం యొక్క విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమం జిల్లాలో ఉన్నా 5 ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా త్రిపురాంతకం పుణ్య క్షేత్రం అయినా బాలా త్రిపుర సుందరిదేవి ఆలయం వద్ద జూన్ 2న జరుగుతుందని తెలిపారు. ఇందులో మండలంలో అన్ని గ్రామాల ఉద్యోగులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు అందరు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామ సుబ్బయ్య,యస్ ఐ శివబసవరాజు, ఏ ఓ నీరజ,ఏపీఓ సుజాత మరికొందరూ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

విశాలాంధ్ర-దొనకొండ: జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ టి.త్యాగరాజు సిబ్బందితో కలిసి మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ వేసవిలో ఆరుబయట పడుకునేటప్పుడు జరుగు దొంగతనాల విషయమై అప్రమత్తంగా ఉండాలని, పొలంలోని విలువైన వస్తువులు భద్రపరుచుకోవాలన్నారు. ఎవరైనా గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు ముందుకు వచ్చి సహకరించాలని ఎస్ఐ కోరారు.

పీసీపల్లి నూతన ఎంపీడీవోగా హనుమంతరావు

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి నూతన ఎంపీడీవోగా ఎన్ వి ఎల్ హనుమంతరావును నియమిస్తూ శనివారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి ఇప్పటివరకు ఇక్కడ ఇన్చార్జి ఎంపీడీవో గా విధులు నిర్వర్తించిన ప్రభాకర్ శర్మ స్థానంలో హనుమంతుని పాడు ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న హనుమంతరావును పీసీ పల్లి నూతన ఎంపీడీవోగా నియమించారు. వెంటనే విధుల్లోకి చేరాలని ఆదేశించారు.

చంద్రబాబు పాలనలో రైతులకు అన్ని కష్టాలే : నాగార్జున

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : చంద్రబాబు పాలనలో రైతులకు అన్ని కష్టాలే అని,రైతులు పండించడానికి అనుకూలమైన వాతావరణం ఉండదు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ఉండవని మాజీ మంత్రి,జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు.బాపట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాగార్జున విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.జూన్ నాలుగో తేదీన జరిగే వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఇంచార్జి కోనా రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించు కార్యక్రమానికి పార్టీ నాయకులు,కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు హామీ ఇచ్చి యువతను మోసం చేశారన్నారు.సూపర్ సిక్స్ పథకాలు పేరుతొ ప్రజలను మోసం చేశారని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన వరి,పొగాకు,మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా కూటమి ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాల వలన రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించకుండా రాష్ట్రంలో రైతులందరూ రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.వైసిపి ప్రభుత్వం హయాంలో రైతులకి మేలు జరిగిందన్నారు. రైతులకి రైతు భరోసా కేంద్రాల ద్వారా పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం వైసీపీ అని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రైతులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ప్రభుత్వ పనితీరు ఉందని తెలిపారు.రైతులు పండించిన పంటను కొనే నాథుడు లేక అల్లాడుతున్నారని వాపోయారు.గత ప్రభుత్వ హయాంలో మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు.గత ప్రభుత్వ హయాంలో రూ.3000 కోట్ల రూపాయలతో ధరలు స్థిరీకరణకు కేటాయించి రైతులకు మద్దతు ధర కల్పించామన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు పక్షపాతిగా ఉంటూ వారికి అండగా పోరాడుతామని తెలిపారు.రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కల్పించి ప్రజలకు విక్రయించామన్నారు. వైయస్సార్సీపి పట్టణ పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి,జోగి రాజా,కొక్కిలిగడ్డ చెంచయ్య,కటికల యెహోషువ, ఏడుకొండలు, అంకమ్మరావు, పిన్ని బోయిన ప్రసాద్,ఒడ్డిముక్కల డేవిడ్,నక్కు వీరారెడ్డి, సముద్రాలు గౌడ్,వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.